epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:354

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 27.07.2026 సోమవారం, హైదరాబాద్

## ఇరాన్, ఒమన్ చర్చల్లో పురోగతి

- హర్మూజ్ జలసంధిని తెరిచే ఛాన్స్
- హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను
- పునరుద్ధరించే విషయంపై టెహ్రాన్‌కు వెళ్లిన ఒమన్ ప్రతినిధుల బృందం
- రెండు రోజుల పాటు ఇరాన్ అధికారులతో భేటీ
- ఒమన్‌తో జరిగిన చర్చల్లో కొంత పురోగతి సాధించామన్న ఇరాన్

2లో





# యువశక్తే దేశ పునాది

### దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వామ్యం చేయాలి

- జై జవాన్ - జై కిసాన్ - జై యువ అని నినదించండి
- లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి వయస్సు 21 ఏండ్లకు తగ్గించాలి
- తీర్మానాన్ని ఉభయ సభల్లో ఆమోదించి కేంద్రానికి పంపిస్తాం
- ఢిల్లీ ఉద్యమ బాధిత కుటుంబాలకు సాయం అందించాలి
- జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

యువశక్తే దేశ భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని, అందుకే 'జై జవాన్ – జై కిసాన్ – జై యువ' అని నినదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తుల కనిష్ఠ వయోపరిమితి ని 25 ఏండ్ల నుంచి 21 ఏండ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. జాతీయ మీడియా ప్రతినిధులు ఆదివారం హైద రాబాద్‌లో ఆయనను కలిసిన సందర్భంలో పలు విషయాల పై స్పందించారు.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదేస్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన ।మిగతా 2 లో।

## ఇది ఆరంభమే...

- ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదు
- బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమించాయి
- అండగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు
- మీ మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యం విజయం
- యువత సమిష్టి పోరాట శక్తిని ఈ ఉద్యమం చాటిచెప్పింది
- విద్య, పాలనలో సంస్కరణల కోసం సిజెపి ఉద్యమం కొనసాగిస్తుంది
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో,:**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యానికి విజయమని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. నిరసనను విరమించడం అంటే ఉద్యమం ముగిసిపోయినట్టు కాదని అన్నారు. "ఇది కేవలం ఆరంభం ।మిగతా 2 లో।



## రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మోడీ ప్రభుత్వం కృషి

- కొమురవెల్లిలో రైల్వే హాల్ట్ స్టేషన్
- ప్రారంభంలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి
- వచ్చే ఏడాది కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- ట్రిపుల్‌ఆర్‌పై త్వరలోనే మోడీ శుభవార్త
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మోడీ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే హాల్ట్ స్టేషన్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది ఒక చారిత్రాత్మకమైన ఘట్టమన్నారు. రెండేండ్లలో ఈ స్టేషన్‌ను నిర్మించి స్వామి వారి సన్నిధిలో భక్తులకు అంకితం చేస్తున్నామని.. దూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనా నికి వచ్చే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి కేవలం రూ.20తో ఇక్కడికి రావచ్చన్నారు. ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ లైన్‌ను త్వరలోనే రూ.300 కోట్లతో విద్యుద్దీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31తేదీ లోగా సిరిసిల్లకు రైలు ప్రారంభిస్తా మన్నారు. వచ్చే ఏడాది వేముల ।మిగతా 2 లో।



## ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

- కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య
- కానీ ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటా
- రాజకీయాలు అవినీతిమయం అయ్యాయి
- నిజాయతీకి చోటు లేకుండా పోయింది
- గతంలో నిను పోటీ చేసినప్పుడు
- ప్రజలే విరాళాలు సేకరించి గెలిపించారు

2లో

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత రాజకీయాలు అవినీతి మయం అయ్యాయని 2028 అసెంబ్లీ ఎన్నికలు సహా భవిష్యత్తులో ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని ప్రకటించారు. వయసుతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఒక కారణమని తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి తనకు 82 ఏళ్లు వస్తాయని సిద్ధరామయ్య తెలిపారు. గతంలో లాగా ఉత్సాహంతో పని చేయడం తనకు ఇక సాధ్యం కాదని రాసుకొచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు

- సీపీఆర్‌తో తప్పిన ప్రాణాపాయం
- పరామర్శించిన కేటీఆర్, హరీశ్‌రావు
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు
- ప్రత్యేకంగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసిన సర్కార్



2లో

## శ్రీరామ్ సాగర్ వద్ద తీవ్ర విషాదం

- ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి
- ముప్కాల్ వద్ద ఎస్ఆర్ఎస్పీలోకి ఈతకు వెళ్లిన నలుగురు యువకులు
- ఎస్ఆర్ఎస్పీ జలాశయంలో మునిగి ముగ్గురు మృతి
- జలాశయంలోనుంచి ముగ్గురు మృతదేహాలు వెలికితీసిన స్థానికులు

2లో

## లోక్‌సభ ముందుకు..నేడు కీలక బిల్లు

- పేపర్ లీక్‌ల నియంత్రణకు కేంద్రం కఠిన చట్టం
- 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు- సిద్ధం
- ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్
- నందన్ నిలేకని నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో..
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే జైలుకే
- ప్రధాని మోదీ కీలక ప్రకటన

2లో



దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైన నీట్, ఇతర నియామక పరీక్షల పేపర్ లీకేజీ ఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభు త్వం సరికొత్త వ్యూహంతో సిద్ధమైంది. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపేలా తీసుకువస్తున్న 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫె యిర్ మీన్స్) సవరణ బిల్లు సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామా లు చోటు చేసుకున్నాయి. ఈ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ లోక్‌సభ ముందుకు తీసుకురానున్నారు.

-తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో

# లోక్‌సభ ముందుకు..నేడు కీలక బిల్లు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైన నీట్, ఇతర నియామక పరీక్షల పేపర్ లీకేజీ ఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో సిద్ధమైంది. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపేలా తీసుకువస్తున్న 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ లోక్‌సభ ముందుకు తీసుకురానున్నారు. బిల్లు ముసాయిదాను ఎంపీలకు కూడా పంపిణీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2024 నాటి చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ నూతన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల వెలుగుచూసిన వివిధ పోటీ పరీక్షల పేపర్ లీకేజీ ఉదంతాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలకు దిగారు. వారి డిమాండ్లకు అనుగుణంగా ఈ సవరణలు అవసరమని భావించిన కేంద్రం.. చర్యలను వేగవంతం చేసింది. సవరణ బిల్లు ప్రకారం.. పరీక్షల్లో అక్రమాలకు లేదా మాల్ ప్రాక్టీస్‌లకు పాల్పడే వ్యక్తులకు విధించే జైలు శిక్షను అయిదు నుంచి పదేళ్లకు పెంచాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం ఈ శిక్ష మూడేళ్ల నుంచి అయిదేళ్లు మాత్రమే. దీంతో పాటు వ్యక్తిగతంగా విధించే గరిష్ఠ జరిమానా పరిమితిని కూడా రూ.10 లక్షల నుంచి ఏకంగా రూ. 50 లక్షల వరకు పెంచనున్నారు. పరీక్షలను నిర్వహించే సర్వీస్ ప్రొవైడర్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కూడా కఠిన చర్యలకు కేంద్రం ప్రతిపాదనలు రూపొందించింది. పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైతే విధించే గరిష్ఠ జరిమానాను రూ. కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచింది. పరీక్షల నిర్వహణ నుండి సంబంధిత ప్రైవేటు ఏజెన్సీలు లేదా అనుబంధ సంస్థలను నిషేధించే బ్లాక్‌లిస్ట్ కాలాన్ని 4 నుంచి 8 సంవత్సరాలకు రెట్టింపు చేసింది. సంస్థలకు చెందిన డైరెక్టర్ల స్థాయి వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పులకు పాల్పడితే వారికి కనీస జైలు శిక్షను మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచారు. వీరికి విధించే వ్యక్తిగత జరిమానాను కూడా రూ. కోటి నుండి రూ.5 కోట్ల వరకు పెంచుతున్నారు. ముఖ్యంగా వ్యవస్థీకృత నేరాలకు (ఆర్గనైజ్డ్ క్రైమ్స్) పాల్పడే ముఠాలకు కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడం, జరిమానాను రూ. 10 కోట్లుగా ప్రతిపాదించారు. ఈ బిల్లు ద్వారా అత్యంత వేగవంతమైన న్యాయ విచారణకు ప్రత్యేక వ్యవస్థను ప్రతిపాదించారు. కేసు దర్యాప్తు ప్రక్రియను కేవలం రెండు నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హై ప్రాధాన్యత లేదా అంతర్రాష్ట్ర పరీక్షల మోసాలను విచారించడానికి కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణ ద్వారా ఛార్జ్‌షీట్ దాఖలైన వడు నెలల్లోపు ట్రయిల్ పూర్తి చేసేలా కఠిన కాలపరిమితిని విధించారు. లోక్‌సభలో సోమవారం నూతన బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పరీక్షల్లో అక్రమాలపై త్వరలో కఠిన చట్టం తెస్తామని, ప్రశ్నాపత్రాల లీకేజీల ప్రక్షాళనకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తానమి ప్రధాని మోదీ ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. దేశంలో పరీక్షల వ్యవస్థపై ఆదివారం ఓ వీడియో సందేశం ద్వారా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు.

పరీక్షల వ్యవస్థలో పారదర్శకత కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో సభ్యులుగా డాక్టర్ ఎస్ సోమనాథ్ (మాజీ ఇస్రో చైర్మన్), తపన్ డేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), ప్రొఫెసర్ వి కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు) ఉంటారని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతామని వెల్లడించారు. నిలేకని నేతృత్వంలోని కమిటీ త్వరలోనే తన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందని, ఈ నివేదిక ఆధారంగా రాబోయే పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నదని, వారి భవిష్యత్తుతో ఆడుకుంటే జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. పేపర్ లేక్ చేసిన వారు ప్రస్తుతం జైలులో ఉన్నారని చెప్పారు.

# యువశక్తే దేశ పునాది

**తరువాయి భాగం**

చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏండ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచస్థాయి సంస్థలకు సైతం నాయకత్వం వహిస్తోందని వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏండ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏండ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏండ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపుదల, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్‌కు అవసరమని ఆయన తెలిపారు.

# ఇది ఆరంభమే...

**తరువాయి భాగం**

మాత్రమే. కాక్రోచ్ జనతా పార్టీకి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది" అని అన్నారు. ఈ ఆందోళనలో అండగా ఉన్న యువత, విద్యార్థులను ఉద్దేశిస్తూ ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. ఇంతకాలం అండగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదని కూడా ఆయన చెప్పారు. మంత్రి రాజీనామా కేవలం ఆరంభం మాత్రమే అని అన్నారు. యువత, సీజేపీ మద్దతుదారుల వల్లే ఇదంతా సాధ్యమైందని అన్నారు. బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమించాయని ప్రశంసించారు.

**37 రోజులుగా...**

ఇకపై ఏం జరుగుతుందోనన్న ఆందోళన లేకుండా తాను ఎట్టకేలకు "ప్రశాంతంగా నిద్రపోగలనని" చెబుతూ ఆయన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. "గత 37 రోజుల్లో నేను ఎదుర్కొన్న పరిస్థితులు చాలా కఠినమైనవి. ఇది నాకు మాత్రమే కాదు, మా బృందంలోని అందరికీ కూడా ఏమాత్రం సులభం కాదు" అని అన్నారు. విమర్శలు, సందేహాలు ఉన్నప్పటికీ ఉద్యమానికి అండగా నిలిచిన దేశవ్యాప్తంగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. "అన్నింటికంటే ముఖ్యంగా, భారతదేశం అంతటా విస్తరించి ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులందరికీ నేను కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. అందరూ మమ్మల్ని అనుమానిస్తున్నప్పుడు మాపై నమ్మకం ఉంచి, మద్దతునిచ్చి, ఆదరించిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు" అని ఆయన పేర్కొన్నారు.

**వ్యక్తిగతంగా కలవలేకపోతున్నా..**

ఆరోగ్య సమస్యల కారణంగా జంతర్ మంతర్ వద్ద గుమిగూడిన మద్దతుదారులను వ్యక్తిగతంగా కలవలేకపోయినందుకు ఈ సందర్భంగా క్షమాపణలు కూడా కోరారు. "నేను నిజంగా క్షమాపణలు కోరుతున్నాను. జంతర్ మంతర్ వద్ద వేచి ఉన్న వారందరినీ కలవలేకపోయాను, వారికి కృతజ్ఞతలు చెప్పలేకపోయాను. ఎందుకంటే నాకు టైఫాయిడ్ వచ్చి తీవ్రమైన జ్వరం ఉంది. నా శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీలు ఉంది. అందుకే నేను ఇంటికి రావాల్సి వచ్చింది" అని వివరించారు.

"ఈ దేశం కోసం మీరు చేసిన కృషిని నేను ఎంతగానో అభినందిస్తున్నాను. మీ అందరినీ నేను ఎంతో ప్రేమిస్తున్నాను. మీరు లేకపోతే మేము దీనిని సాధించలేకపోయేవాళ్ళం. మీ అందరికీ నా సెల్యూట్" అని అన్నారు. "మా పట్ల సందేహాలు వ్యక్తం చేసిన వారికి, మమ్మల్ని విమర్శించిన వారికి లేదా 'మీరు సీరియస్‌గా లేరు, మీకు నిరసన తెలపడం తెలియదు' అని ప్రశ్నించిన వారికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు మమ్మల్ని విమర్శించి, ప్రశ్నించకపోయి ఉంటే, మేము మెరుగుపడేవారమే కాదు. 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఇంకా సుదీర్ఘ ప్రయాణం ఉంది. కచ్చితంగా మేము చాలా దూరం వెళ్తాము. ఇది కేవలం ఆరంభం మాత్రమే" అని ఆయన అన్నారు.

**ప్రధాన్ రాజీనామా సరే..పరిహారం అందాలి**

"ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. కానీ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందాలి. వారికి అది దక్కాలి. ఆ కుటుంబాలన్నింటికీ కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి" అని దిప్కే అన్నారు. అయితే, మరణించిన వారి కుటుంబాలకు సాధ్యమైనంత గరిష్ట పరిహారాన్ని అందించడానికి కేంద్రం అంగీకరించింది. జూలై 20న జరిగిన 'చలో పార్లమెంట్' ర్యాలీలో చోటుచేసుకున్న ఘర్షణలకు సంబంధించి పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. యువత సమిష్టి పోరాట శక్తిని ఈ ఉద్యమం చాటిచెప్పిందని సీజేపీ ప్రతినిధి నేహా బోరా అన్నారు. "ఏకమైన యువత మార్పును తీసుకురాగలదు. ఇది ముగింపు కాదు, ఒక కొత్త ఆరంభం" అని ఆమె అన్నారు. విద్య, పాలనలో సంస్కరణల కోసం కృషి చేస్తూనే, యువతను ప్రభావితం చేసే అంశాలను తమ సంస్థ లేవనెత్తుతూనే ఉంటుందని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. "యువతకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం. విద్య, పాలనలో సంస్కరణల కోసం కృషి చేయడం ఈ ఉద్యమం కొనసాగిస్తుంది" అని అన్నారు

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మోడీ ప్రభుత్వం కృషి

**తరువాయి భాగం**

వాడ, 2029లోగా కొత్తపల్లి వరకు ఈ రైల్వేలైన్ పనులు పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు రూ.500 కోట్లతో నిర్మించబోయే ఎంఎంటీఎస్ రైలుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేసి ఇవ్వాలన్నారు. రూ.3500 కోట్లతో పాండురంగాపురం, భద్రాచలం పనులు పూర్తి చేయబోతున్నామని, తెలంగాణలో ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు వందేభారత్ ట్రైన్లను తెలంగాణకు ఇచ్చిందన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందనీ.. వచ్చే ఏడాది దాన్ని ప్రారంభించుకోబోతున్నామన్నారు రూ.5 లక్షల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు బుల్లెట్ ట్రైన్ల ద్వారా జరుగుతోందని.. తెలంగాణ అభివృద్ధిలో బుల్లెట్ ట్రైన్లు గేమ్ చేంజర్ కాబోతున్నాయన్నారు. ట్రిపుల్ ఆర్కు సంబంధించి త్వరలోనే మోడీ శుభవార్త అందిస్తారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. లక్షలాది మంది మల్లన్న భక్తులు అనేక ఏండ్లుగా రైల్వే స్టేషన్ కావాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం వారి కోరికను నెరవేర్చిందన్నారు. అంతకుముందు కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవనేని రఘునందన్‌రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పింగళి శ్రీపాల్ రెడ్డి, అంజిరెడ్డి, రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం హనుమకొండలోని తన స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు హనుమకొండ నగరంలోని రోహిణి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మమతారెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది సార్లు సీపీఆర్ ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళంలో రక్తం గడ్డ కట్టడంతో బ్లాకులు ఏర్పడ్డాయని నిర్ధారించి అవి కరగడానికి ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత, యాంజియోగ్రామ్ చేశారు. దీంతో పల్స్ నార్మల్‌గా ఉండడంతో కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు హుటాహుటిన హనుమకొండకు వచ్చి సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

మధ్యాహ్నం తర్వాత కొంతమేర పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం కుదుటపడింది. మరింత మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. దీనికోసం హనుమకొండ నుంచి హైదరాబాద్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసింది. సుదర్శన్ రెడ్డికి వెంటిలేటర్ సహాయంతో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మాజీ సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ రెడ్డికి గుండెపోటుకు గురయ్యారనే వార్త తెలుసుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులు, నర్సంపేట నుంచి పెద్ద సంఖ్యలో పెద్ది అభిమానులు హనుమకొండలోని రోహిణి ఆసుపత్రికి తరలివచ్చారు.

# ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత రాజకీయాలు అవినీతి మయం అయ్యాయని 2028 అసెంబ్లీ ఎన్నికలు సహా భవిష్యత్తులో ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని ప్రకటించారు. వయసుతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఒక కారణమని తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి తనకు 82 ఏళ్లు వస్తాయని సిద్ధరామయ్య తెలిపారు. గతంలో లాగా ఉత్సాహంతో పని చేయడం తనకు ఇక సాధ్యం కాదని రాసుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటానని అన్నారు. ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. అయితే, వరుణ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయాలని ప్రజలు కోరినప్పటికీ వాటిని తిరస్కరించినట్లు సిద్ధరామయ్య వెల్లడించారు. గతంలో తాను పోటీ చేసినప్పుడు ప్రజలే విరాళాలు సేకరించి తనను గెలిపించారని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజలకే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేటి రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, నిజాయతీకి చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య వివరించారు. మాండ్య జిల్లా కేఆర్ పేటలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయగా, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వివరిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం డీ.కే. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, రాజీనామా అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం ఆఫర్ చేసిన రాజ్యసభ సీటును తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. తాను 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, విజయాలు, ఓటములు రెండింటినీ చూశానని పేర్కొన్నారు. కానీ, తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించకపోవడం, అంతరాత్మకు ద్రోహం చేయకపోవడం అనే సంతృప్తి ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# శ్రీరామ్ సాగర్ వద్ద తీవ్ర విషాదం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఈత సరదా యువకుల ప్రాణాల మీదకు తెస్తోంది. ఓవైపు ఈతపై సరైన ప్రావీణ్యం లేకపోవడం, మరోవైపు జలాశయాల లోతుపై అంచనా లేమి, పర్యవేక్షణ కొరవడటం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతోంది. రాష్ట్రంలో నిత్యం ఏదో చోట జరుగుతున్న ఈ విషాద ఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయి. తాజాగా ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృత్యువాత పడిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. శ్రీరామ్ సాగర్ జలాశయంలో ఈతకు వెళ్లిన నలుగురు యువకుల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. వివరాల్లోకి వెళితే ముప్కాల్ వద్ద ఎస్‌ఆర్‌ఎస్పీలోకి నలుగురు యువకులు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జలాశయంలో మునిగి ముగ్గురు మృతిచెందారు. సమాచారం అందుకున్న స్థానికులు జలాశయంలోంచి ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. ఈతకు వెళ్లిన వారిలో ముగ్గురు నిజామాబాద్ వాసులు, ఒకరు హైదరాబాద్కు చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో యువకుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చేతికి అందివచ్చిన యువకులు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈతకు వెళ్లి మృతి చెందుతున్న వారిలో 5 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న వారే ఎక్కువశాతం ఉంటున్నారు. పిల్లలకు ఈత కొట్టడం రాకపోయినా చెరువులు, బావులకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా 10 సంవత్సరాల వయసున్న పిల్లలు ప్రమాదాన్ని అంచనా వేయడంలో విఫలమై విగత జీవులుగా మారుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలిసీతెలియని వయసులో ప్రాణాలు కోల్పోయి కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు. ఇక 15 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారు కూడా ఈత కొట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో జలాశయాల్లో మునిగి ఈతరాక విగత జీవులుగా మారుతున్నారు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే ఈత రాని వారు మాత్రమే నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే స్విమ్మింగ్ వచ్చిన వారు సైతం ప్రమాదాలు, అక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమై విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. చెరువులు, కుంటలు, కాలువల్లోని బురద, నాచు, నీటి లోపల రాళ్లు ఉండటం కారణంగా ఈత వచ్చిన వారూ చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్నాయి. అందుకే అందరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. మరికొన్ని సందర్భాల్లో కొంతమంది తమ తోటి స్నేహితులు మునుగుతున్నపుడు రక్షించే క్రమంలో వారితో పాటు ప్రాణాలు కోల్పోతున్నారు.

# ఇరాన్, ఒమన్ చర్చల్లో పురోగతి

- సాంకేతిక, రాజకీయపరమైన అంశాలపై ప్రధానంగా చర్చలు చేశాం
- ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయీ

**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశంపై ఇరాన్, ఒమన్ విస్తృత చర్చలు జరిపాయి. హర్మూజ్ జలసంధి మార్గం గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించే విషయంపై టెహ్రాన్‌కు వెళ్లిన ఒమన్ ప్రతినిధుల బృందం రెండు రోజుల పాటు ఇరాన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయీ అధికారికంగా ధ్రువీకరించారు. ఒమన్‌తో జరిగిన చర్చల్లో కొంత పురోగతి సాధించామని చెప్పారు. అయితే, తీరప్రాంత దేశాల సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లకుండా, హర్మూజ్ గుండా వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు బఘేయీ పేర్కొన్నారు. సాంకేతిక, రాజకీయపరమైన అంశాలపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు చెప్పారు. అయితే హర్మూజ్ జలసంధి మార్గం గుండా వెళ్లే నౌకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, అదే సమయంలో చర్చలు కొనసాగుతాయని ఇస్మాయిల్ బఘేయీ స్పష్టం చేశారు.

**హర్మూజ్‌పై పట్టు సాధించేందుకు అమెరికా సన్నాహాలు**

మరోవైపు, హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు సేవా రుసుములు విధించడంపై చర్చిస్తామని ఒమన్, ఇరాన్ దేశాలు జూన్‌లోనే ప్రకటించాయి. అది అమెరికాకు రుచించలేదు. దీంతో ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం కుదిరిన రోజుల వ్యవధిలోనే హర్మూజ్ కేంద్రంగా మరోసారి వివాదం మొదలైంది. హర్మూజ్‌పై పట్టు సాధించేందుకు అమెరికా మరోసారి దాడులు మొదలు పెట్టింది. కాగా, యూఎస్ఏ చర్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. తమ అనుమతి లేకుండా ఒక్క నౌకను కూడా హర్మూజ్ దాటనివ్వబోమని హెచ్చరించింది. దీంతో హర్మూజ్‌కు మరోవైపు ఉన్న ఒమన్ తీరం గుండా నౌకలు ప్రయాణించేలా అమెరికా ప్రోత్సహించింది. అందుకు ఒమన్ కూడా అంగీకరించింది. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, కొన్ని రోజులుగా ఇరాన్‌పై అమెరికా దాడులు నిలిపివేయడంతో టెహ్రాన్, మస్కట్ మధ్య చర్చలు ఊపందుకున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల ఇరాన్కు సమీపంలో ప్రయాణిస్తున్న దిశా నౌకపై జరిగిన దాడి అనంతరం, 28 మంది భారతీయ సిబ్బందిని ఇరాన్ రక్షించింది. నౌకపై దాడి అనంతరం భారతీయ, ఇతర సిబ్బందిని ఇరాన్ రక్షించడం, నావికుల భద్రత పట్ల వారి నిబద్ధతను స్పష్టం చేస్తోందని భారత్లోని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ పేర్కొన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్ నావికుల జాతీయతతో సంబంధం లేకుండా వారి ప్రాణాలను రక్షించామని పేర్కొన్నారు. "ఇరాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశిస్తున్న నౌకపై శత్రు బలగాలు దాడి చేయగా, వెంటనే నౌకలోని సిబ్బంది ఇరాన్ కోస్ట్గార్డ్ సిబ్బందికి సంకేతాలు పంపించింది. దీంతో అధికారులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. నౌకలోని 28 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా కాపాడారు" అని ఫతేలీ పేర్కొన్నారు. కాగా, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో సముద్ర భద్రతను నిర్ధారించడానికి ఇరాన్ కట్టుబడి ఉందని ఫతాలీ పునరుద్ఘాటించారు. ఈ జలమార్గాలు ప్రపంచ వాణిజ్యానికి ముఖ్యమైనవని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, నౌకపై జరిగిన దాడిని టెహ్రాన్లోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకోవడానికి స్థానిక అధికారులతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎక్స్లో పేర్కొంది. ""ఐఎంఓ నంబర్ 8818219" కలిగిన ఎల్పీజీ నౌకలో మొత్తం 28 మంది భారతీయులు విధులు నిర్వహిస్తున్నారు. దాడి అనంతరం వారందరి క్షేమాన్ని నిర్ధారించాం. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. భారతీయ సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక యంత్రాంగంతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నాం. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం" అని రాయబార కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.





# బోనాల ఉత్సవాల్లో 'చాణక్య స్కూల్' విద్యార్థులు

- మండలంలో ఘనంగా బోనాల ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్థానిక చాణక్య స్కూల్ విద్యార్థులు

**మానకొండూరు, తెలంగాణ చౌరస్తా:**

మండలంలోని ఘనంగా బోనాల ఉత్సవాలు జరిగాయి. ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, బోనాల వేడుకల్లో పాల్గొనగా, మానకొండూరులో బోనాల పండుగ వాతావరణం సంతరించుకుంది. బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాగా ఈ వేడుకలో స్థానిక చాణక్య స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అద్భుతమైన ప్రదర్శనలు చేస్తూ, తెలంగాణ బోనాల విశిష్టతను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనం ఎత్తుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, బోనాల పండుగ విశిష్టతను తెలియజేసే ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కాంగ్రెస్ ఇన్చార్జిగా గాండ్ల మోహన్


- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఉత్తర్వులు
- 100% అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం



**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:** మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండల సమగ్ర ఓటర్ ప్రత్యేక సవరణ ఇన్చార్జిగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్‌ను నియమించారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఈ మేరకు నియామక పత్రాన్ని జారీ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ఇన్చార్జులను నియమించారు. ఈ సందర్భంగా గాండ్ల మోహన్ మాట్లాడుతూ.. పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఫారాలు నింపించి, ఆన్‌లైన్ చేయిస్తామని తెలిపారు. ముత్తారం మండలంలో 100 శాతం సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఇతర నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తుంగతుర్తి ఎలాంటి వర్గ విభేదాలు లేవు

- ఉన్నవి భేదాభిప్రాయాలు మాత్రమే
- వాటిని పార్టీ అధిష్ఠానం పరిష్కరిస్తుంది
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:** నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ప్రెస్‌మీట్‌లో మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ నాయకత్వంలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు ₹40 కోట్ల నిధులతో నూతనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, అయితే మందుల సామేల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను వేగంగా అమలు చేస్తూ తుంగతుర్తి నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మందుల సామేల్ చురుకైన పాత్ర పోషించారని, అలాగే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండటంతో గత ఎన్నికల్లో 52 వేల మెజారిటీతో ఘన విజయం సాధించారని గుర్తు చేశారు. ఈ అభివృద్ధిని చూసి కొందరు రాజకీయ విమర్శలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, చిన్నచిన్న సమస్యలు ఉన్నా పార్టీ అధిష్ఠానం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనంతుల శ్రీనివాస్, దీప శంకర్ నాయక్, జ్యోతి సుధాకర్, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు, జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న, సైరెడ్డి, సుధీర్ రెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణ ప్రశాంత్, అంబేద్కర్, నాగమల్లు, ఇరుగు కిరణ్, అశోక్, బద్రి, క్రాంతి, శ్రీకాంత్, మధు, వీరబాబు, నవీన్తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




# ఏఐవైఎఫ్ మండల కార్యదర్శిగా నిమ్మల గణేష్

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అబ్దుల్లాపూర్ మెట్టు మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.స్థానిక రావి నారాయణరెడ్డి కాలనీలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ఇన్చార్జ్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ మినిట్స్ బుక్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ,విద్య,వైద్యం వంటి ప్రధాన సమస్యలపై ఎప్పటికప్పుడు తమ పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.అలాగే మండలంలో జరుగుతున్న భూ పోరాటాలకు ఏఐవైఎఫ్ అండగా నిలవాలని,సిపిఐ పార్టీకి అనుబంధంగా ప్రజా సమస్యలపై ముందుండాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక:** మండల ఏఐవైఎఫ్ నూతన ప్రధాన కార్యదర్శిగా నిమ్మల గణేష్,అధ్యక్షుడిగా వంగూరి శోభన్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పోల్మారి రాజు ప్రవీణ్,సిర్పంగి శ్రీను,చంటి,భాను ప్రకాష్, అశోక్,ఆరావత్ శ్రీను, వినయ్, అంగోత్ సుధాకర్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,మండల పార్టీ కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# భజన బృందానికి రూ.60 వేల మైక్ సెట్ విరాళం

- అడ్డగిరి శివ విరాళం
- సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి సన్మానం

**తెలంగాణ చౌరస్తా, మధిర :** వెంకటాపురం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన రామనామ ఏకాహం కార్యక్రమంలో అడ్డగిరి శివ రూ.60 వేల విలువైన మైక్ సెట్‌ను భజన సమాజానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా మైక్ సెట్‌ను భజన సమాజానికి అందించి, అడ్డగిరి శివను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తుమ్మలకు పువ్వాడ సవాల్

- రుణమాఫీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా.
- రఘునాథపాలెం మండలంలో ఒక్క గ్రామంలోనైనా పూర్తి రుణమాఫీ జరిగిందని నిరూపించాలని డిమాండ్



**తెలంగాణ చౌరస్తా, ఖమ్మం:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పువ్వాడ అజయ్‌కుమార్ బహిరంగ సవాల్ విసిరారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏ ఒక్క గ్రామంలోనైనా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలైందని నిరూపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. దుకాణాల్లో అందుబాటులో ఉన్న యూరియాను యాప్ ద్వారా మాత్రమే పంపిణీ చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, మోటార్లు కాలిపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. వర్షాభావంతో రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. "ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదు" అని వ్యాఖ్యానించిన పువ్వాడ, రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన సాగిందని, రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయం పాటించాలి

- జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం చంద్రకళ



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:** తుంగతుర్తి నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలని సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం చంద్రకళ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రస్తుతం మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలే అహర్నిశలు శ్రమించారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ ఆనందాన్ని కార్యకర్తలు పూర్తిగా అనుభవించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ కార్యకర్తలను వర్గాలుగా విభజించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి చర్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి కార్యకర్తల మనోవేదనను తొలగించే చర్యలు చేపట్టాలని, అందరినీ సమన్వయం చేసి తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని మహేశ్వరం చంద్రకళ కోరారు.

# వంతెన ఫైల్‌లో.. రైతు వాగులో!

- వంతెనకు గ్రీన్ సిగ్నల్.. పనులకు రెడ్ సిగ్నల్..
- ఆరికాయలపాడు–జన్నారం వాగుతో నిత్యం అవస్థలు..
- తాత్కాలిక మరమ్మతులు, వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రైతుల విజ్ఞప్తి



**తెలంగాణ చౌరస్తా, వైరా:** ఏన్కూరు మండలంలోని ఆరికాయలపాడు-జన్నారం గ్రామాల మధ్య ఉన్న వాగు రైతులకు నిత్యసమస్యగా మారింది. ప్రతిరోజూ ఇదే మార్గంలో పొలాలకు వెళ్లాల్సి వస్తున్న రైతులు, సరైన రాకపోకల సౌకర్యం లేక ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పనులకు అవసరమైన ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు, ఎరువులు, విత్తనాలు, పంట ఉత్పత్తుల రవాణా తీవ్రంగా దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని, పొలాలకు చేరుకోలేక వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయని చెబుతున్నారు. ఈ ప్రాంతానికి వంతెన మంజూరైనట్లు చెప్పినా, ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "వంతెన ఫైల్‌లో ఉంది... రైతు మాత్రం ఇంకా వాగులోనే ఉన్నాడు" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు కనీసం వాగులో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రైతులు, గ్రామస్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఈ సమస్యను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, తాత్కాలిక మరమ్మతులతో పాటు వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆరికాయలపాడు, జన్నారం గ్రామాల రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# 'జైల్ భరో'ను విజయవంతం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న చేపడుతున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు.ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కేంద్రంలో హిట్లర్ పాలన సాగుతోందని,కార్మికుల హక్కులను కాలరాసేందుకు చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.కార్మిక వర్గమంతా ఐక్యమై పోరాడి హక్కులను కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ఈ జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుండె శివకుమార్, బాలరాజు, శ్రీశైలం, ముత్యాలు, భిక్షపతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టొద్దు

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు,రెచ్చగొట్టే వ్యాఖ్యలు ,దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకొని కుల,మత,ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు,శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు.సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్,ట్విట్టర్,ఇంస్టాగ్రామ్,వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా,ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న,తమకు తెలియని వీడియోలు,ఫోటోలు పోస్టులు చేసిన,వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ,ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు.సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు.పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు.సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన,ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.




# కొత్తగూడెంలో అట్టహాసంగా 'ఈశా గ్రామోత్సవం'

- పోలీస్ గ్రౌండ్స్‌లో ఘనంగా వాలీబాల్ పోటీలు
- తలపడిన 350 మంది క్రీడాకారులు ఆసుపాక జట్టు కైవసం చేసుకున్న ప్రథమ స్థానం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా :** భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ గ్రౌండ్‌లో 18వ ఈశా గ్రామోత్సవ వాలీబాల్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 350 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో ఆసుపాక జట్టు ప్రథమ స్థానం సాధించగా.. కొయ్యూరు ద్వితీయ, కేఎన్‌పురం తృతీయ, కాశీనగరం జట్లు నాలుగో స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దుమ్ముగూడెం సీఐ టి. వెంకటప్పయ్య, ములకపాడు సర్పంచ్ తులసమ్మ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలంటే క్రీడలే సరైన మార్గమని, ఆటలు క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు సద్గురు 2004లో ఈశా గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఏపీ, తెలంగాణల్లోని 15 జిల్లాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 6న కోయంబత్తూరు ఆదియోగి సన్నిధిలో జరిగే ఫైనల్స్‌తో ఈ వేడుకలు ముగుస్తాయి. వాలీబాల్, త్రోబాల్ విజేతలకు రూ.5 లక్షల చొప్పున, మొత్తంగా రూ.1 కోటికి పైగా నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా కలెక్టర్ బి. రాహుల్, ఎస్పీ బి. రోహిత్ రాజులకు ఈశా ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థుల విజయంతో ప్రజాస్వామ్యం గెలిచింది

- కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల రాజు



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** గత కొన్ని రోజులుగా ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జరుగుతున్న నీట్ పరీక్షలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని చెప్పి జరిగిన పోరాటంలో విద్యార్థుల పోరాట ఫలితంగా రాజీనామా చేయడంతో ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు.కేంద్రంలో అధికారంలో వచ్చినప్పటి నుండి నరేంద్ర మోడీ పాలన నిరంకుశంగా సాగుతుందని, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని అన్నారు.బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఊపా చట్టం కింద దేశ ద్రోహం లాంటి కేసులను వేసి,విద్యార్థుల మీద పగ సాధించే చేసే ప్రయత్నం చేశారన్నారు.కానీ విద్యార్థులు ఐక్య పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగాల్సి వచ్చిందని అన్నారు.బిజెపి ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని,రాహుల్ గాంధీ ముందున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



# బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత

- జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గోపగాని రమేష్ గౌడ్

**తుంగతుర్తి తెలంగాణ చౌరస్తా..** తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన కత్తుల వెంకన్న సతీమణి కత్తుల నవ్య ఇటీవల మరణించడంతో ఆ కుటుంబానికి జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గోపగాని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం 50కేజీల బియ్యం అందజేశారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను జీఆర్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నల్లబెల్లి వెంకటేష్, బొంకూరి రాంబాబు,పోలేపల్లి కిరణ్, దుర్సోజు శివకుమార్, అంబేద్కర్ యూత్ క్లబ్ అధ్యక్షులు కొండగడుపుల ప్రశాంత్, కత్తుల నరేందర్, కత్తుల నవీన్,మల్లెపాక అజిత్, బంగారు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం

**విద్యార్థి,యువతకు నేడు ఈ దేశం గురించి పట్టింపు లేదు. ఈ వ్యవస్థలో ఉన్న రుగ్మతలపై పోరాడటం లేదని మధనపడుతున్న సందర్భంలో నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన బాధ్యుడైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భగత్ సింగ్, జ్యోతిరావు పూలే ఫోటో లను, చేతిలో రాజ్యాంగం పట్టుకొని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేసిన ప్రొటెస్టు ఈ దేశంలోని ఉద్యమకారులకు, ప్రజలకు, పోరాడే శక్తులకు ఊరట కల్పించింది. ఆ ఉద్యమంపై పోలీసుల భాష్ప వాయు గోళాలు ప్రయోగించిన, లాఠీ చార్జి చేసిన, అక్రమ అరెస్టులు, కేసులు నమోదు చేసిన విద్యార్థుల ఆక్రందనలు, వారు వ్యక్తం చేసిన భావాలు ఈ దేశ ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ దేశంలోని చాలా మంది ప్రజానీకానికి ఈ ఉద్యమం ప్రేరణగా నిలిచింది. అలాంటి సందర్భోచిత అంశాలు కొన్నింటిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిజెపి పాలన ఎలా భ్రష్టు పట్టిందో దాని విధానాల అమలు - ఫలితాలు విద్యార్థుల,యువత గుండెల్లో దాగిన ఆవేశం కట్టలు తెంచుకొని బహిర్గతం కావడం లోనే మోడీ ప్రభుత్వ వైఫల్యాలు అర్థం చేసుకోవాలి. విద్యార్థులు వివిధ రూపాలలో తమ మనోవేదనలు సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రకటించినప్పుడు వారి లో ఉన్న వర్గ స్పృహ పై ఒక నమ్మకం ఏర్పడింది.**



కాక్రోచ్ జనతా పార్టీ హేళనతో ఆవిర్భవించిన ఆది మొదటగా నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల ఆత్మహత్యల సమస్య ను గుర్తించి భ్రష్టు పట్టిన విద్యా విధానం బూజును దులపడానికి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రధానమైన డిమాండ్ తో దీక్షలు చేయడం బిజెపికి కునుకు లేకుండా చేసింది. బిజెపిలో ప్రకంపనాలు సృష్టించింది. ఈ పోరాటం దేశ రాజధాని డిల్లీ నుండి బిహార్,ఒడిశా, ముంబయి,పంజాబ్ ఇతర రాష్ట్రాల కు ఎగబాకింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల భాగస్వామ్యం కూడా ఉండటంతో ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ పోరాటమే విభిన్నంగా కొనసాగింది. వివిధ పోరాట రూపాలను ప్రదర్శించడంతో ఇలా కూడా ఉద్యమాలు నిర్వహించవచ్చా అనే విధంగా ఉంది. ఈ ఉద్యమం ను నీరుగార్చడానికి అనేక విధాలుగా బిజెపి ఐటీ సెల్ విభాగాలు రాయలేని భాషలో అణచివేతకు పాల్పడ్డారు. ఈ ప్రొటెస్టులో విద్యార్థులు ఘాటుగా స్పందించే తీరు, వ్యక్తం చేసే అభిప్రాయాలు స్పృహతో కూడినవి. ఆలోచింపజేసినవి. ఆ ఉద్యమంలో భాగస్వామ్యం చేయించే విధంగా కదిలించింది.

ఈ విద్యార్థి ఉద్యమంలో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి చేసిన పోరాటం ఆ సన్నివేశాలు మీడియాలో వీడియోలు చూస్తుంటే ఆనంద భాష్పాలు వచ్చాయి. పోరాడే సంఘాల కు కర్తవ్యాలను గుర్తు చేసింది. విద్యార్థులపై ముఖ్యంగా అబ్బాయిలపై పోలీసులు లాటీలు ఝులుపిస్తుంటే పోలీసులను నివారించడానికి తమ రెండు చేతులు అడ్డం పెడుతూ నిలబడిన అమ్మాయిల దృశ్యాలు మన కళ్ళముందే ఉన్నాయి. ఒక తల్లి తన పిల్లల ను ఒక ప్రమాదం వచ్చినప్పుడు తన ప్రాణాలను అడ్డంపెట్టి ఎలా పిల్లలను కాపాడుకుంటుందో ఆ విధంగా తల్లి పాత్రలను పోషించారు. ముంబైలో విద్యార్థులను అరెస్టు చేసి పోలీసుల వాహనంలో తరలిస్తుంటే ఆ వాహనానికి ఒక అమ్మాయి చేతిని అడ్డుపెట్టి గంటకు పైగా ఆ బండిని నిలిపింది.తన పోరాట పటిమను తెలియజేసింది. అనేక రోజుల నుండి జంతర్ మంతర్ లో హంగర్ స్ట్రైక్ చేస్తుంటే ఆ ఉద్యమాన్ని గోదిమీడియా వక్రీకరించింది. ఆ గోది మీడియాను విద్యార్థినీలు ప్రశ్నిస్తూ, ప్రతిఘటిస్తూ తమ చైతన్యాన్ని ప్రదర్శించారు. అమ్మాయిలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న పోలీసుల తీరును ప్రభుత్వ క్రౌర్యం ను ప్రశ్నిస్తూ ఏడుస్తూ తమ బాధలను వెళ్ళగక్కారు. అమ్మాయిలను బట్టలు చింపారు .వారి ఎదలపై తన్నారు. అయినా మాలాంటి పిల్లలు మీకు లేరా, ఎందుకు మమ్ములను కొడుతున్నారంటూ పిల్లల ఆర్తనాదాలు ఒక్కసారే ఈ దేశ ప్రజలను ఉలిక్కిపడే విధంగా చేశాయి. బిజెపి ఐటీ సెల్ వారు ఆ విద్యార్థులను దేశద్రోహులని , పాకిస్తానీయులు ,టెర్రరిస్టులంటూ ఉదరగొట్టిన ఎక్కడ బేనకకుండా ఉద్యమంలో ఉన్నారు. ఈ దేశాన్ని కాపాడుకోవాలని మేము ఉద్యమిస్తుంటే మీకు మేము టెర్రరిస్టులుగా, దేశద్రోహులుగా కనబడితే నిజంగా మేము టెర్రరిస్టులమే, దేశద్రోహులమే నంటూ చాటిచెప్పారు. ఈ దేశంలో పుట్టి ,ఈ దేశంలో పెరిగి, ఈ దేశ అభివృద్ధిని కాంక్షించే మమ్ములను పెయిడ్ ఆర్టిస్టులంటూ కితాబులిస్తే ఊరుకునేది లేదని మా అమ్మ,అయ్యా సంపాదించిన డబ్బులతో ఢిల్లీ నగర బొడ్డుకి వచ్చి ఈ ఆందోళన కొనసాగిస్తున్నామని హెచ్చరించారు. తిండి తిప్పల లేకుండా విద్యార్థులు ఉద్యమంలో ఫుట్ పాత్ పై నిద్రిస్తుంటే ఉద్యమాన్ని అణిచివేయ చూశారు. వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం బాధ్యత మరిచి పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వం నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పై ఎకౌంటుబులిటి తీసుకోవాలని గర్జించిన గొంతుకల ను నలిపివేయడానికి అన్ని విధాలుగా కేంద్రం ప్రయత్నించంది. బిజెపి ఐటీ సెల్ విభాగం మసి పూయడానికి అప్రాజస్వామికంగా వ్యవహరించిన అదరలేదు, బెదరలేదు.ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఆకలితో ఉన్నారని ఢిల్లీ నగరవాసులతో పాటు వివిధ ప్రాంతాల వారు ఆన్లైన్లో ఫుడ్ ను ఆర్డర్ పెడితే వాటిని కూడా నివారించే చర్యలకు కేంద్రం పూనుకుంది. అయినా పోలీసులు తమ లాఠీలతో రక్తం కారే విధంగా కొట్టిన, కాళ్లు చేతులు ఇరగట్టిన, చంపిన పోలీసులు ఆకలితో ఉన్నారని వాళ్ల కడుపు ఆకలి మంటలను ఆర్పడానికి పోలీసులకు వాటర్ బాటిల్స్,ఫుడ్ ను అందజేసి గొప్ప ఔదార్యాన్ని చాటారు. సివిల్ డ్రెస్ లో ఉండి తమపై దౌర్జన్యం చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తల నీతిమాలిన చర్యలను బహిర్గతం చేశారు. పోలీస్ డ్రెస్ పై నేమ్ ప్లేట్స్ లేకుండా విధులు నిర్వహించడం చట్ట వ్యతిరేకమైనమని ఈ సమాజానికి తెలియజేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అంశాలను దీనిలో పొందుపరచాల్సి వస్తుంది. ఈ పోరాటం నుండి తీసుకోవాల్సిన అనుభవాలను ఉద్యమ గుణపాటాలను నేడున్న స్థితిలో మనమెందుకు ఆ స్థాయిలో ఉద్యమాలను కొనసాగించలేకపోతున్నామో స్వీయ పరిశీలన చేసుకోవాలి.

ప్రముఖ మేధావి వాంగుచుక్ ఈ ఉద్యమానికి మద్దతు తెలిపి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. అయిన ఆరోగ్యం క్షీణిస్తున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరిగింది. ఈ ఉద్యమానికి ప్రకాష్ రాజ్ లాంటి వారితోపాటు విద్యార్థి, యువజన సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. వారందరూ చైనా తొత్తులని గోదిమీడియా గద్దోలు పెట్టిన అందరూ ఐక్యంగా ఈ ప్రభుత్వంపై తిరగబడ్డారు. విష ప్రచారాలను తిప్పి కొట్టారు.

విద్యార్థుల పోరాటాల ఫలితంగా మొత్తానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనితో ఈ విద్యార్థి పోరాటం ప్రభుత్వ మెడల వంచి కొత్త పోరాట చరిత్రను లిఖించింది. ఉద్యమాల ద్వారా కొత్త వరవడిని నిర్మించవచ్చని మరొకసారి ఈ దేశ ప్రజలకు విద్యార్థులు మార్గాన్ని చూపారు. ఆ పోరాట మార్గాన్ని విడువబోమని ఈ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దానిపై పోరాటాన్ని ఎక్కుపెట్టాల్సి ఉంది. మోడీ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారు. కులం, మతం, ప్రాంతం, జాతి, జాతీయత, దేశభక్తి పేరుతో ప్రజలను విచ్చిన్నం చేస్తున్నారు. దేశ అభివృద్ధిని మరిచి కార్పొరేట్ల అభివృద్దే ,దేశ అభివృద్ధి గా కీర్తిస్తున్నారు. ఈ దేశ సంపదను వారికి ధారా దత్తం చేస్తున్నారు. దీనితో ప్రజలు అనేక అసౌకర్యా నికి గురవుతున్నారు. ప్రశ్నించిన, మాట్లాడిన ,తమ అభిప్రాయాలు వ్యక్తం చేసిన ద్రోహులుగా చిత్రీకరించే విధానం పెరగడంతో ఒక తీవ్రమైన అసంతృప్తి ప్రజల్లో నెలకొంది. ఈ దేశంలోని ,చట్టాలను, హక్కులను అమలు చేయకుండా నిర్బంధ పూరితంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఈ దేశంలో అందరికీ హక్కులు రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఆ వెలుగులో ఈ దేశంలో పోరాటాలను విద్యార్థుల పోరాట స్ఫూర్తితో కొనసాగించాల్సిన కర్తవ్యం మన ముందు ఉంది.



గంట నాగయ్య



# కోమటిరెడ్డి బ్రదర్స్ పై అనుచిత వ్యాఖ్యలు తగదు

- ఎమ్మెల్యే మందుల సామేలు తన వ్యాఖ్యలు వెన్నక్కి తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దొనకొండ రమేష్

**తుంగతుర్తి,తెలంగాణ చౌరస్తా:**

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఇటీవల కోమటిరెడ్డి బ్రదర్స్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దొనకొండ రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో ఇక్కడ తెచ్చుకొని ఎమ్మెల్యే అయిన నీవు వారు చేసిన సహాయాన్ని మరచి మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. నాడు ఎమ్మెల్యే గెలుపు కోసం ప్రచారంలో తిరిగి డబ్బు ఖర్చు పెట్టుకుని గెలిపించిన ఘనత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ది అన్నారు. అలాంటి వ్యక్తిపై నేడు ఎమ్మెల్యే సామెల్ అక్కకు వెళ్ళగకుతున్నారంటే ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. తుంగతుర్తి తో రాజగోపాల్ రెడ్డికి సంబంధం లేకుంటే ఎందుకు టికెటు ప్రాధేయపడ్డారో సమాధానం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసర్ల రాములు, కాసర్ల చంద్రయ్య, కాసర్ల సైదులు, నకరికంటి అయోధ్య,చింతకుంట్ల నాగయ్య, పేర్ల నరేష్, పేర్ల ప్రహ్లాద, జటంగి హరిప్రసాద్, జటంగి గంగయ్య, వీరబోయిన సందీప్, వీరబోయిన నరేష్, పచ్చిపాల గణేష్, వర్ధల్లి నరేష్, దాచేపల్లి సతీష్, జటంగి మహేష్, కంచం సంతోష్,మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షాల కోసం జలాభిషేకం

- టీఎల్‌పేటలో ఘనంగా బోనాల వేడుకలు
- గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు
- సకాలంలో వర్షా లు, సమృద్ధి పంటల కోసం భక్తుల ప్రార్థనలు

**తెలంగాణ చౌరస్తా, వైరా:**

ఏన్కూరు మండలంలోని టీఎల్ పేట గ్రామంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామదేవతలకు ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనడంతో పాటు పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గూగులోత్ ప్రవీణ్ మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమం, గ్రామాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాల కోసం గ్రామదేవతలను ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామస్తులంతా ఐక్యంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నామ వెంకయ్య, ఇల్లూరి ఆదినారాయణ, పాశం ఉమామహేశ్వరరావు, పాశం శ్రీనివాసరావు, జుజ్జూరి శ్రీనివాసరావు, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లమోతు రామారావు, ఎల్లంకి లక్ష్మీనరసయ్యతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది.

# పెద్ది త్వరగా కోలుకోవాలి

- బాదావత్ బాలాజీ
- అత్యుత్తమ వైద్యం అందించాలి
- కేసీఆర్ చొరవను అభినందించిన వైరా బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ

**తెలంగాణ చౌరస్తా, వైరా :**

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అస్వస్థతకు గురైన విషయం బాధాకరమని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) స్వయంగా ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, హైదరాబాద్‌లో అత్యుత్తమ వైద్యం అందేలా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు ఆదేశాలు ఇవ్వడం ఆయన నాయకత్వ బాధ్యతను చాటిచెప్పిందని బాలాజీ పేర్కొన్నారు. పార్టీ ముఖ్య నేతలు, కుటుంబ సభ్యులు, వైద్యులతో నిరంతరం మాట్లాడుతూ చికిత్సను పర్యవేక్షిస్తున్న కేసీఆర్ చొరవ అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిసి సంతోషం వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు బాదావత్ బాలాజీ తెలిపారు. అలాగే ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్టీ శ్రేణులంతా ఆయన త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని పేర్కొన్నారు.





# హరితాభివృద్ధి లక్ష్యం

- తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వన మహోత్సవం
- మొక్కల పంపిణీ..

**తెలంగాణ చౌరస్తా,సికింద్రాబాద్:**

హరితాభివృద్ధి లక్ష్యంగా తారక సేవ సమాఖ్య ఆధ్వర్యంలో, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ సహకారంతో తార్నాకలో వన మహోత్సవం2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. స్థానికులు భారీగా పాల్గొని మొక్కలను స్వీకరించారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ అసిస్టెంట్ డైరెక్టర్ దోనేపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ, సెక్షన్ ఆఫీసర్ సాగర్ సరీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. నమోదు చేసుకున్న కుటుంబాలకు మామిడి, ఉసిరి, మునగతో పాటు రెండు అలంకార మొక్కలు కలిపి మొత్తం ఐదు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు. యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నల్లూరి శివరాం ప్రసాద్, తోటకూర చంద్రమౌళయ్య, వసుంధరా దేవి పాల్గొన్నారు. తారక సేవ సమాఖ్య వ్యవస్థాపక ట్రస్టీలు అడుసుమిల్లి చిట్టి వీరయ్య, మన్నె నాగమల్లేశ్వరి, కాట్రగడ్డ నరేంద్రబాబు ముఖ్య అతిథులను సత్కరించారు. ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు పచ్చని భవిష్యత్తుకు మనవంతు బాధ్యత అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ట్రస్టీలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన హెచ్ఎండీఏ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, దాతలు, మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రజలకు తారక సేవ సమాఖ్య కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు తార్నాక నాగార్జున నగర్ హనుమాన్ దేవాలయం పరిసరాల్లో, ఎయిర్ పోర్ట్ బస్ స్టాప్ వద్ద మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో తారక సేవా సమాఖ్య సభ్యులతో పాటుగా రాంబాబు, విజయ కుమార్, పాల్గొన్నారు



# 'ఛలో కొత్తగూడెం'ను జయప్రదం చేయండి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు పిలుపు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,తెలంగాణ చౌరస్తా:**



ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న "ఛలో కొత్తగూడెం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆగస్టు 9ని ఐక్యరాజ్యసమితి (యూ ఎన్ ) ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా గుర్తించినప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9న ఆదివాసీలు అంతా ముందుగా తమ తమ గ్రామాల్లో ఆదివాసీ జెండాలను ఆవిష్కరించుకుని, అనంతరం భారీ సంఖ్యలో జిల్లా కేంద్రానికి చేరుకోవాలని కోరారు. రాబోయే 'ఛలో కొత్తగూడెం' కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కొత్తగూడెం నడిబొడ్డున ఆదివాసీల సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ కొత్తగూడెం డివిజన్ అధ్యక్షుడు పాయం లక్ష్మీనర్సు, జిల్లా నాయకులు జోగ శ్రీను, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి కోర్స శరత్, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి గొప్ప రమేష్, మండల నాయకులు కురసం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

- అమర జవాన్ల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత
- క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**





కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ..... కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు.దేశ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ దేశం కోసం పోరాడిన సైనికుల ధైర్యసాహసాలు,దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.వీర జవాన్ల త్యాగాలను స్మరించుకోవడం, వారి కుటుంబాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అవసరమని, దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలను మనం ఎప్పటికీ మరువకూడదని డా. శరణ్య యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, కార్యదర్శి కాటం సత్యం,కోశాధికారి టి.వి. సురేష్ బాబు, క్లబ్ చైర్‌పర్సన్ గంట వెంకట రమణ రెడ్డి, బూదర్తి బుచ్చన్న పటేల్, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ తోట చంద్రయ్య, కొప్పుల సునీల్, ఓర్రె మల్లయ్య, జానీ, నజీమ్, సదానందం,తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి హోదా పొందిన విజయరామణను కలిసిన సర్పంచ్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు కి రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పించిన సందర్భంగా శివపల్లి లోని ఎమ్మెల్యే విజయరమణ రావు నివాసంలో జాఫర్ ఖాన్ పేట్ గ్రామ సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి,పూలమాల వేసి,చేతికి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దండ నర్సింహ రెడ్డి, మాదాసు గట్టయ్య,బాబా,కిరణ్, ఉపసర్పంచ్ శ్రావణి శ్రవణ్,వార్డ్ సభ్యులు చిన్న,ఆనంద్,సుగుణ సాగర్,తదితరులు పాల్గొన్నారు.